



కొలువుతీరిన దేవతామూర్తులు



ఏటి పండుగకు తరలివచ్చిన నగర వాసులు





మహిళల ఆటపాటలు, కోలాటం



గొబ్బిపాటలు పాడుతున్న ముత్తైదువలు

పెన్నాలో భక్తి ప్రవాహం

- కోలాహలంగా ఏటి పండుగ
- భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల నిమజ్జనం
- కొలువుదీరిన దేవతామూర్తులు
- అలరించిన నృత్యాలు, పతంగుల ఎగురవేత
- కిటకిటలాడిన పినాకినీ తీరం



నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాల్లో చివరి పండుగయిన ఏటి పండుగ పెన్నానది తీరంలో గురువారం రాత్రి కోలాహలంగా జరిగింది. అటు పవిత్ర పినాకినీ తీరం.. ఇటు గొబ్బెమ్మల నిమజ్జనం.. మరోవైపు ఇసుకేస్తే రాలనంత జనంతో పెన్నాతీరం కిటకిటలాడింది. కుల మతాలకు అతీతంగా చిన్నా పెద్దా అంతా కుటుంబాలతో కలిసి వచ్చి ఈ వేడుకలో పాల్గొన్నారు. వివిధ రంగుల్లో విభిన్న ఆకృతులతో పతంగులు ఆకాశంలో సందడి చేశాయి. వీటిని ఎగురవేయడంలో చిన్నారులు, యువకులు పోటీపడ్డారు. యువత కేరింతలు, ఈలలు, పాటలు, క్రీడలు, గుర్రపు స్వారీలు, రంగుల రాట్నాలతో ఏటి పండుగ అహ్లాదకరంగా సాగింది.



ఏటి పండుగలో పాల్గొని పిండివంటలు ఆరగిస్తున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు



పెన్నానీటిలో గొబ్బెమ్మలను నిమజ్జనం చేస్తున్న హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి వచ్చిన మహిళలు

కొలువుదీరిన దేవతామూర్తులు

భక్తులను ఆశీర్వదించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి దేవతామూర్తులు సర్వాభరణాలు, విశేష అలంకారాలతో వచ్చి కొలువుదీరారు. జొన్నవాడ మల్లికార్జున, కామాక్షితాయి, నెల్లూరు రాజరాజేశ్వరమ్మ, నర్రవాడ వెంగమాంబ, నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి తదితరులు ఉభయదేవేరులతో తరలివచ్చారు. వీరేకాక మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, మూలస్థానేశ్వరస్వామి, శ్రీకృష్ణధర్మరాజులస్వామి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి తదితరులు కూడా కొలువుదీరారు. కార్యక్రమాలను జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవోలు అర్వభూమి శ్రీనివాసరెడ్డి, గిరికృష్ణ, ఇన్‌స్పెక్టర్లు ఆర్.చైతన్య, సుధీర్, వేమూరి గోపి తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల ఓలలాడింపు

సంక్రాంతి సంబరాల్లో భోగి నుంచి కనుమ పండుగ వరకు మహిళలు, యువతులు, గొబ్బెమ్మ(గౌరీ) మహాశివుడి ప్రతిమలను మట్టితో తయారు చేసి గొబ్బినోములు నోచారు. నాలుగోరోజు గొబ్బెమ్మలను పెన్నా జలాల్లో ఓలలాలింపు (నిమజ్జనం) చేసేందుకు ముత్తైదువులు, యువతులు తరలివచ్చారు. సంప్రదాయ, వస్త్రాలు ధరించి పెన్నానది తీరంలో గొబ్బెమ్మలకు పూజలు చేశారు. అనంతరం పాటలు పాడుతూ పెన్నలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువతీ,యువకులు కబడ్డీ, చెమ్మచెక్క, కళ్లకుకంతలు కట్టుకుని దాగుడుమూతలు ఇతర ఆటలతో సందడి చేశారు. బూరలు ఊదుతూ యువకులు సందడి చేశారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

సందడి చేసిన ఏడు కుటుంబాలు

నెల్లూరు చెందినవారు ఉద్యోగం, వ్యాపారం రీత్యా బయట రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో స్థిరపడిన ఏడు కుటుంబాలకు చెందిన 60 మంది కుటుంబ సభ్యులు ఏటి పండుగలో సందడి చేశారు. అమెరికా నుంచి హోతా కుటుంబం, బెంగుళూరు నుంచి పంచాగ్నల కుటుంబం, విజయవాడ నుంచి జాగర్లపూడి, జంగా కుటుంబాలు, గుంటూరు నుంచి కోట, వారణాసి కుటుంబాలతోపాటు విశాఖ నుంచి మాండలిక కుటుంబం, నెల్లూరు నుంచి పిసుపాటి కుటుంబం నుంచి దాదాపు 60 మందికిపైగా కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో దేవదాయశాఖ, ఇరిగేషన్, పోలీసు, నగర పాలక సంస్థ, విద్యుత్, అగ్నిమాపకదళంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఏటి పండుగ విజయవంతానికి సమష్టిగా కృషి చేశారు.నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, పలువురు టీడీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుటుంబ బంధాలు బలోపేతానికే...

కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు బలోపేతం అయ్యేందుకే ఏటి పండుగ అని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం రాత్రి వెంకటేశ్వరపురం పెన్నా తీరంలో ఆయన ఏటి పండుగను ప్రారంభించారు. చిన్నారులు, యువకులతో కలిసి బెలూన్లు, గాలిపటాలు ఎగురవేశారు. మైదానమంతా కలియ తిరుగుతూ ముత్తైదువులు నిర్వహించిన గొబ్బెమ్మల నిమజ్జనాన్ని ఆసక్తిగా తిలకించారు. గొబ్బెమ్మ నోము విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఏటి పండుగకు తరలివచ్చిన దేవేరులను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తదుపరి మంత్రి నారాయణ తదితరులు పిండి వంటలు ఆరగించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్కా బావ వెంట వెళ్లి
మృత్యువాత

- అల్లుడు, కూతురు చనిపోవటంతో తల్లిదండ్రుల రోదన
- అనంతసాగరం గ్రామంలో విషాదం



యామిని మృతదేహం

కందుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పరిధిలోని పాకల సముద్ర తీరంలో గురువారం సముద్ర స్నానానికి వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఒకరు కందుకూరు మండలం అనంతసాగరానికి చెందిన యువతి కావడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. అక్కా,బావలతో కలిసి సంక్రాం తిని ఆనందంగా జరుపుకున్న కొండాబత్తిన యామిని (14) ఈ ఘటనలో మృతి చెందింది. యామినితోపాటు ఆమె బావ కూడా మృతి చెందగా, ఆమె అక్క నవ్యను స్థానిక మత్స్యకారులు కాపాడగలిగారు.

కందుకూరు మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన కొండాబత్తిన సురేష్, సంపూర్ణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తెను కందుకూరు మున్సిపాలిటీలోని దూబగుంటకు చెందిన యువకుడికిచ్చి పెళ్లి చేశారు. రెండో కుమార్తె నవ్యను పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీ శివన్నపాలెంకు చెందిన నోసిన మాధవకి ఇచ్చి వివాహం జరిపించారు. మూడో కుమార్తె యామిని అవివాహిత. ఆమె సంక్రాంతి పండుగకు కోసం చిన్నక్క ఇంటికి వచ్చి మూడు రోజులు ఆనందంగా గడిపింది. చివరిరోజు సముద్ర స్నానాలకు వెళ్తుండటంతో వారితో కలిసి వెళ్లిన యామిని మృతిచెందింది. దీంతో సురేష్-సంపూర్ణ దంపతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ముక్కుపచ్చలారని ఓ కుమార్తె మృతి చెందగా, మరోకుమార్తె భర్త చనిపోవటంతో వారిని ఓదార్చటం ఎవరితరం కాలేదు.

రేపటి నుంచే పక్షుల పండుగ

- సూళ్లూరుపేట కేంద్రంగా ప్రారంభ, ముగింపు వేడుకలు
- నేలపట్టు, అటకానితిప్పలో వ్యూ పాయింట్లు
- బీవీపాలెంలో పడవ షికారు.. శ్రీసిటీలో వర్క్ షాపు
- తిరుపతి, నెల్లూరుల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా శనివారం నుంచి పక్షుల పండుగ జరగనుంది. వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు ఈ వేడుకను ఆపేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులపాట జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను శనివారం ఉదయం సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ ప్రారంభించనున్నారని తిరుపతి జిల్లా కలెక్టరు వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ ఏర్పాట్ల గురించి గురువారం మధ్యాహ్నం జేసీ శుభమ్ బన్సాల్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణమూర్తి తదితరులతో కలిసి కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు.

ఐదు చోట్ల ఉత్సవాలు

సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, బీవీపాలెం, శ్రీసిటీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తారు. పక్షుల అభయారణ్యమైన నేలపట్టు, అటకానితిప్ప ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పెలికాన్ కొంగలను మరో ఏడెనిమిది జాతుల విదేశీ పక్షులను వీక్షించొచ్చు. ఇప్పుడు పెలికాన్ కొంగలు గూళ్ల ఏర్పాటు చేసుకునే సమయం కూడా. దీనికోసం ఈ రెండు ప్రాంతాల్లో వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి బైనాక్యులర్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. నేలపట్టులో అదనంగా స్నేక్ షో ఉంటుంది. అటవీశాఖ నుంచీ 50 మంది గైడ్లను నియమించారు. బీవీపాలెం పడవల రేవులో పర్యాటకులు పులికాట్ సరస్సులో షికారు చేయడానికి 35 పడవలు సిద్ధం చేశారు. ప్రతి బోటులోనూ లైఫ్ జాకెట్లు, ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్లు ఉంటారు. ఈ ఐదు చోట్లా వైద్య శిబిరాలు, హెల్ప్ సెంటర్లు, భారీ బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శోభాయాత్ర

తొలిరోజు చెంగాలమ్మ ఆలయం నుంచీ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు మూడు రోజులూ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలు కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. శ్రీసిటీ సెజ్‌లో మూడు రోజుల పాటు పులికాట్ పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహిస్తోంది.

6-7 లక్షల మంది వస్తారని అంచనా

చివరిసారి 2020 జనవరిలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజుల్లో ఐదు లక్షల మంది వీక్షించారు. నాలుగేళ్ల విరామం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నుంచీ ఏడు లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా.

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగో, వెబ్‌సైట్ల ఆవిష్కరణ

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగోను, వెబ్‌సైట్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ శాశ్వతంగా ఉంటుందన్నారు. నేలపట్టు, అటకానితిప్ప, పులికాట్ సరస్సుల పర్యావరణానికి సంబంధించి ఆసక్తి వున్నవారు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకనే వీలు కల్పించామన్నారు.

వెక్కిరిస్తున్న రహదారులు

సంక్రాంతి పోయినా.. యథాతథంగానే గుంతలు

సంగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారాయి. గత పాలకులంతా ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపుతో జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పనిచేశారు. ఈ క్రమంలో వారు రహదారుల గురించి పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వయంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా 'పల్లె పండుగ' పేరిట రూ. కోట్లాది రూపాయల నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు, పాలకులను భాగస్వాములను చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్లా పల్లె పండుగ పేరిట రోడ్లపై గుంతలు లేకుండా చేస్తున్నారు. అయితే సంగం మండలంలో మాత్రం ఆ పనులు చేపట్టకపోవడంతో రహదారులు పాలకులను వెక్కిరిస్తున్నాయి.



గుంతలుమిట్టలుగా అన్నారెడ్డిపాళెం - మక్తాపురం రోడ్డు

ఇవిగో సాక్ష్యాలు..

- వంగల్లు - మర్రిపాడు రహదారి ఎప్పటి నుంచో గుంతలమయమై ఉంది. గతంలో ఆటో డ్రైవర్లు ఈ రోడ్డులో ప్రయాణం చేయలేక గుంతలను వారే మట్టితో పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి యథావిధిగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పండగకు సొంతూర్లకు వచ్చే ప్రజలు, వాహనచోదకులకు ఇక్కట్లు తప్పలేదు.
- అన్నారెడ్డిపాళెం - మక్తాపురం రోడ్డుది కూడా ఇదే పరిస్థితి. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు ఐదు కిలోమీటర్ల పొడవుంది. తారంతా లేచిపోయి గుంతలమయమైయింది. కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆ గుంతలు పూడ్చలేదు.
- ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న తరుణవాయి - చెన్నవరపాడు రోడ్డు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా అడుగుకో గుంత ఏర్పడి ఉంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకుల ఇక్కట్లు తప్పడంలేదు.
- పల్లిపాళెం - సంగం రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఈ రహదారి పంచాయతీరాజ్ ప్రాజెక్టు పరిధిలో ఉంది.
- పెరమన - జంగాలదొరువు రహదారిలో గత ఐదేళ్లలో వైసీపీ నాయకుల గ్రావెల్ దందాతో అధ్వానంగా తయారయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రావడంతో అధ్వానంగా ఉన్న రహదారులు సంక్రాంతి నాటికి బాగుపడుతాయని గ్రామీణులు కలలు కన్నారు. సంక్రాంతి వెళ్లిపోయింది కానీ గుంతలు మాత్రం అలాగే ఉన్నాయి.

కానరాని ఊరి పేర్లు

జాతీయ రహదారి సర్వీస్ రోడ్ల కూడలిలో ఊరి పేర్లు కనపడకపోవడంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. జాతీయ రహదారి నుంచి ముసునూరు మీదుగా కావలి వచ్చే మార్గంలో ఊరి పేరుతో గతంలో ఏర్పాటు చేసిన బోర్డులో పేరు తొలగి పోవటంతో రాత్రి వేళల్లో కావలి వచ్చే మార్గం తెలియక వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే అధికారులు స్పందించి సర్వీస్ రోడ్ల కూడళ్లలో ఊరిపేర్ల సూచిక బోర్డులు ఏర్పాటు చెయ్యాలని వాహనదారులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



నిర్వహణ లోపంతో దుకాణాలు శిథిలం



ప్రజాధనంతో నిర్మించిన నగర పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు నిర్వహణా లోపంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అల్లూరు పట్టణంలోని శివయ్య గుంటను పూడ్చివేసి పంచాయతీ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అయితే నిర్వహణా లోపంతో దుకాణాలపై మొక్కలు మొలిచి గోడలు ధ్వంసమైపోతున్నాయి. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలపై మొలిచిన మొక్కలను తొలగించి భవనాలు ధ్వంసం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

నాసిరకంగా జల్ జీవన్ మిషన్ పనులు



జల్ జీవన్ మిషన్ ద్వారా గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు నీళ్లొదలడంతో పథకాలు మూలనపడిపోతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రమైన కలువాయిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ పథకం కింద రూ.46లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో రూ.21లక్షలు ఖర్చు చేసి బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద కొత్తగా బోరు, మోటారు, షెడ్డూ వేసి అక్కడినుంచి కలువాయి పరమటివీధిలో ఉన్న ట్యాంక్‌కు పైపులైన్ కలిపారు. అయితే నాసిరకంగా పనులు చేపట్టడంతో పైపులు తరుచూ పగలిపోతున్నాయి. నాలుగు నెలల క్రితం పైపులైను పగిలిపోవడంతో అప్పటినుంచి అదనపు నీటి పథకం మూలనపడిపోయింది.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)

ఉపయోగం లేని ప్రయోగాలు

- జూ.కళాశాలల్లో ప్రాక్టి 'కిల్స్' • రికార్డుల్లోనే ప్రయోగశాలలు
- అడ్డదారుల్లో ప్రాక్టికల్స్ మాయ • వచ్చేనెల 10 నుంచి నిర్వహణ

నెల్లూరు(విద్య), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఎంతో కీలకం. ఇందులో మార్కులు తగ్గితే ఎంసెట్, నీట్, ఐఐటీ-జేఈఈలలో వెయిటేజీ తగ్గుతుంది. అయితే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగశాలలు రికార్డులకే పరిమితమయ్యాయి. అక్కడ ప్రయోగశాలలు ఉన్నా ఉపయోగం లేకుండా పోతున్నాయి. ప్రాక్టికల్స్ గడువు ముంచుకొస్తుండగా అభ్యాసంపై నిర్లక్ష్యం నెలకొంది. ఫిబ్రవరి 10 నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రాక్టికల్స్ నిర్వహించకున్నా, అక్రమాలకు పాల్పడినా ఇంటర్‌బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందా? లేక ఎప్పటిలాగానే మిన్నకుండిపోతుందా..? అన్నది చర్చనీయాంశమైంది.

• నామమాత్రంగా ప్రయోగాలు

ఇంటర్‌లో ప్రయోగాలు నామమాత్రంగా మారాయి. ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ప్రయోగాలు చేయిస్తుండగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు మాత్రం ప్రయోగాన్ని అటకెక్కించేశాయి. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 187 ఉన్నాయి. వీటిలో 116 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలుండగా ప్రభుత్వ కళాశాలలు 24, ఎయిడెడ్ 2, మోడల్ 11, సోషల్ వెల్ఫేర్ 6, కేజీబీవీలు 12, హైస్కూల్ ప్లస్ 16 కళాశాలలు కలిపి మొత్తం 71 కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నాయి..ఈ మొత్తం కళాశాలల్లో 53 వేల మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అధికశాతం కళాశాలల్లో ప్రయోగశాలలు కరువయ్యాయి.కొన్ని మొక్కుబడిగా దర్శనమిస్తుండగా, మరికొన్ని కళాశాలల్లో అసలు గదులు కేటాయింపే జరగలేదు. దీంతో తరగతి గదుల్లోని బల్లలపై మొక్కుబడిగా ప్రయోగాలు నిర్వహించుకోవాల్సి వస్తున్నది.అంతేకాక అధికశాతం మంది విద్యార్థులు ప్రాజెక్ట్ రికార్డులు కూడా తయారుచేయలేని దుస్థితిలో ఉన్నారు. ప్రాక్టికల్స్ సమయంలో ఎగ్జామినర్లను లోబరుచుకుని తమ పిల్లలకు అత్యధిక మార్కులు వేయించడంలో యాజమాన్యాలు ముందున్నాయి. ఈ విషయమై ఇటీవల ఇంటర్‌బోర్డుకు వరుస ఫిర్యాదులు రావడంతో ఈ ఏడాది ప్రాక్టికల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించింది.

• మొక్కుబడిగా నిర్వహణ

ఇప్పటివరకు ఏ కళాశాలలో కూడా ప్రాక్టికల్స్ తరగతులు నిర్వహించిన దాఖలాలేలేవు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు తప్పని సరిగా మొదటి సంవత్సరం నుంచే ప్రాక్టికల్స్ పరీక్షలు ఉంటాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు విడివిడిగా ఒక్కో సబ్జెక్ట్‌కు వారానికి రెండు పీరియడ్లు ప్రాక్టికల్స్ నిర్వహించాలి. అంటే నాలుగు సబ్జెక్ట్‌లకు కలిపి ఎనిమిది పీరియడ్లు నిర్వహించాలి. బైపీసీ విద్యార్థులకు నెలకు 32 పీరియడ్లు, ఎంపీసీ విద్యార్థులకు 15 పీరియడ్లు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇవి ఎక్కడా కూడా అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. అధికారుల తనిఖీల్లో మాత్రం చూపించడం కోసం ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు విమర్శలున్నాయి.



ప్రయోగ పరీక్షలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

• ప్రభుత్వ ఆదేశాలూ బేఖాతర్

ప్రాక్టికల్స్‌లో మార్పులు తీసుకువచ్చేందుకు ఇంటర్‌బోర్డు సూచనలు చేస్తూ ప్రతి కళాశాలలోనూ ప్రయోగశాల నిర్వహణ, తరగతులు జరపాలని ఉన్నతస్థాయిలో ఆదేశాలు జారీ చేసింది. అయినా కూడా జిల్లాలో ఇవేమీ పట్టించుకోవడంలేదు.ప్రాక్టికల్స్ సమయంలో అధికారులను కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఒప్పందాలు చేసుకుంటూ ఇప్పటి వరకు గట్టెక్కామని, ఇకపై నుంచి అదే తంతు తిరిగి కొనసాగిస్తామంటూ బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

• మార్కులే కీలకం

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు తమ పాఠ్యాంశాలతో పాటు ప్రయోగాలు కూడా తప్పనిసరిగా నిర్వహించాలి. ఎంపీసీ విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు, బైపీసీ విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీలతో పాటు బోటనీ, జువాలజీలలో ప్రయోగాలు చేయాల్సి ఉంది. ఎంపీసీలో 60 మార్కులకు, బైపీసీలో 120 మార్కులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. అయితే వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

ప్రాక్టికల్స్ పక్కాగా నిర్వహించాలి



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాల్లో ప్రయోగ తరగతులు పక్కాగా నిర్వహించాల్సిందే.. ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఆదేశాలిచ్చాం.. ఇంటర్‌బోర్డు నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, 10 నుంచి జనరల్ ప్రాక్టికల్స్ ప్రారంభమై 20న ముగుస్తాయి. నాన్ జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ ఏడాది 120 సెంటర్లలో ప్రయోగ పరీక్షలను పక్కాగా నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ ఏ శ్రీనివాసులు, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి

ప్రైవేటు ట్రావెల్స్ బస్సులకు రూ.14.22 లక్షల ఫైన్

• ఓ బస్సు సీజ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రోజుల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందడంతో రవాణాశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన బస్సులకు అపరాధ రుసుము విధించారు. ఆ వివరాలను ఇన్‌చార్జి డీటీసీ శ్రీచందన గురువారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘించిన 84 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వాటికి రూ.14,22,240 అపరాధ రుసుము విధించామని, ఒక బస్సును సీజ్ చేశామని పేర్కొన్నారు. ఈ దాడులు కొనసాగుతాయని, ప్రయాణికుల వద్ద అధిక చార్జీలు వసూలు చేసినా, నిబంధనలు అతిక్రమించినా సహించేది లేదని హెచ్చరించారు.



వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద బస్సులు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

తాళాలు వేసిన ఇంట్లో చోరీ

• రూ. 60 వేల విలువైన ఇత్తడి సామగ్రి అపహరణ

సంగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో తాళాలు వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మావిళ్ల ఆనంద్ పిల్లల చదువు రీత్యా బుచ్చిరెడ్డిపాలెంలో కాపురం ఉంటున్నాడు. ఊరిలో పొలాలు ఉండడంతో ప్రతిరోజు పొలానికి వచ్చి పోతూ ఇళ్లు చూసుకుని వెళ్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న విలువైన ఇత్తడి సామాగ్రి కనిపించలేదు. దీంతో చోరీకి గురైందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ. 60 వేల విలువైన ఇత్తడి సామాగ్రి చోరీకి గురైందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు

• ఐదుగురి అరెస్ట్

సైదాపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడి పందేల స్థావరాలపై గురువారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కాంతికుమార్ మాట్లాడుతూ అనంతమడుగు గ్రామంలో ఐదుగురిని అరెస్టు చేసి రూ.4,600 నగదుతో పాటు ఒక కోడి స్వాధీనం చేసుకున్నామన్నారు. కొమ్మిపాడు గ్రామంలో ఇద్దరిని అరెస్టు చేసి రూ.1,600 నగదుతో పాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

• మనుబోలులో 8మంది అరెస్టు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలు పొలాల్లో పండుగల వేళ కోడిపందెం నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎస్‌ఐ. శివరాకేష్ తన సిబ్బందితో గురువారం కోడిపందెం స్థావరంపై దాడులు చేశారు. ఈ దాడిలో 8మంది పందెం రాయుళ్ళను, వారివద్దనున్న 4కోళ్ళను, రూ. 7వేల 320ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ. తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మళ్లీ అదే తంతు

మద్యం దుకాణానికి అధికారులు తాళాలు

ఉదయగిరి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం మద్యం దుకాణం వద్ద రెండో రోజైన గురువారం కూడా మళ్లీ అదే తంతు కొనసాగింది. బుధవారం దుకాణానికి తాళాలు వేయించిన ఎక్సైజ్ సిబ్బంది గంటల వ్యవధిలోనే తిరిగి అమ్మకాలు కొనసాగించిన విషయం విదితమే. దీంతో గురువారం యథావిధిగా నిర్వాహకులు అమ్మకాలు కొనసాగిస్తుండడంతో హడావిడిగా అక్కడికి చేరుకున్న ఆ శాఖ అధికారులు మరలా దుకాణానికి తాళాలు వేయడం విశేషం. దీంతో పలు గ్రామాల నుంచి మద్యం కోసం వచ్చిన మందుబాబులు వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అసలు ఆ గ్రామంలో దుకాణం ఏర్పాటు చేసేందుకు పూర్తి స్థాయిలో అనుమతులు ఉన్నాయా, ఉంటే ఇలాంటి పరిస్థితి ఎందుకు చోటు చేసుకుంటుంది, రాజకీయ కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిర్వాహకులు మాత్రం సిబ్బంది లేకపోవడంతో తామే స్వయంగా తాళాలు వేస్తున్నామంటూ చెప్పుకోవడం కొసమెరుపు.



తలుపులు తెరుచుకోని మద్యం దుకాణం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.7632
వెండి కిలో ధర	రూ. 94,600
వెండి ఒక గ్రాము	రూ.97.60

సౌత్‌మోపూరులో వ్యవసాయ మోటార్ల చోరీ

నెల్లూరు రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామంలో ఇటీవల వ్యవసాయ మోటార్లు వరుసగా చోరీకి గురవు తున్నాయి. కనుపూరు కాలువ నుంచి సాగు నీటిని సరఫరా చేసే ఈ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రుళ్లు అపహరించుకుపోతున్నట్లు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై రూరల్ సీఐ వేణు స్పందిస్తూ రాత్రుళ్లు బీట్ ఏర్పాటు చేసి నిఘా పెంచుతామని తెలిపారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభం

• నెలపాటు అవగాహన సదస్సులు • పలు శాఖల సమన్వయంతో కార్యక్రమాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఆర్‌అండ్‌బీ, నేషనల్‌హైవే, ఆర్టీసీ, మెడికల్‌అండ్‌హెల్త్, రవాణాశాఖ అధికారులు పాల్గొని మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీటీసీ శ్రీ చందన మాట్లాడుతూ గురువారం నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులంతా సంయుక్తంగా ఈ మాసోత్సవాలను నిర్వహిస్తారన్నారు. రోడ్డు ప్రమాదాలు, రోడ్డు నియమాలపై కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు, బైక్ ర్యాలీలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు, బ్లాక్ స్పాట్స్‌పై చర్చా కార్యక్రమాలను ఈ నెల రోజుల్లో నిర్వహిస్తామన్నారు. ప్రమాదాల నివారణస్త్ర లక్ష్యంగా జాతీయ రహదారి మాసోత్సవాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ, నేషనల్ హైవే అధికారులు, ఆర్టీసీ అధికారులు, రవాణాశాఖ ఎంవీఐలు, ఏఎమ్‌వీఐలు తదితరులు పాల్గొన్నారు.




జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ శాఖల అధికారులు

ఆర్చరీ జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

• జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్

నెల్లూరు(విద్య), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమంగా రాణించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ సూచించారు. నెల్లూరులో ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పార్కులో గురువారం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు. అనంతరం జాతీయ పోటీలకు ఎంపికైన ఆర్ సాయి మౌర్య, కే తరుణీష్ జాత్య, సీహెచ్ అక్షయ్ మహదేవ్, జీ వెంకట లోకేష్, ఏ సాత్విక్, పీ రాజేష్, ఏ లాస్య, కోచ్‌లు వీ భరద్వాజ్‌రెడ్డి, టీ శివశంకర్, దివి ప్రకాష్, హారతి, సాయికిరణ్, జయశంకర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి పసుపులేటి రామ్మూర్తి, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంరెడ్డి శ్రీహర్ష, కార్యదర్శి పావురాల వేణు, ఒలంపిక్ సంఘం అధ్యక్షకార్యదర్శులు ఆనం మహేష్‌రెడ్డి, గురుప్రసాద్, గాదం వాసు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

19న జిల్లా జట్ల ఎంపిక

జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వతేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా ఆర్చరీ బాల, బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన వారు విజయవాడలో ఈనెల 23 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

కుష్టువ్యాధి సర్వే పక్కాగా నిర్వహించాలి

• జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్టువ్యాధికి సంబంధించి ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం నెల్లూరులోని జేఎస్‌ఆర్ కాలనీ, కపాడిపాళెం పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌ఎంలకు సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేలా వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఈ నెల 20 నుంచి 14 రోజులపాటు సర్వే సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మానస, డాక్టర్ పర్వీన్, డాక్టర్ కల్యాణ్. విజయలక్ష్మి, సుబ్బయ్య, రమణారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'సూర్య ఘర్'ను సద్వినియోగం చేసుకోండి

• విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), జనవరి 16 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న సౌరవిద్యుత్తు పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ కోరారు. జిల్లా అధికారులతో ఆయన చాంబర్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. సూర్యఘర్ పథకానికి అందరూ దరఖాస్తు చేసుకునేలా చైతన్యపరచాలని ఆదేశించారు. ప్రభుత్వం దీనికోసం అందిస్తున్న రాయితీలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలోవాట్ల సౌరవిద్యుత్తును ఉచితంగా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోందన్నారు. సోలార్ విద్యుత్తుపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, పరంధామయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 70.073 టీఎంసీల నీరు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 1,933 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 70.073 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేడు రవాణా శాఖ మంత్రి రాక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఆయన శుక్ర, శని వారాలు జిల్లాలో ఉండి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

రేపటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో ఈనెల 18 నుంచి 21వతేదీ వరకు నెల్లూరు కలర్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో జరుగుతుందని, ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9గంటల వరకు ప్రజలు తిలకించవచ్చని తెలిపారు. ఎం సుందర్‌బాబు గీసిన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారకరామారావు చిత్రాలతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కళాపోషకులు, కళాభిమానులు, ఔత్సాహిక కళాకారులు తరలిరావాలని కోరారు.

భూ వివాదంపై ఘర్షణ : ఏడుగురికి తీవ్ర గాయాలు

మర్రిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాట గ్రామంలో భూవివాదానికి సంబంధించి ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఏడుగురికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. వివరాల మేరకు.. నాగినేనిగుంట రెవెన్యూలోని సర్వే నెంబర్ 332లో 341.3 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంతమేర భూమిని ఆక్రమించుకునేందుకు ఈటె వెంకటయ్య అనే వ్యక్తి కంపచెట్లను తొలగించి ట్రాక్టరుతో దున్నాడు. అయితే ధనమ్మ అనే మరో మహిళ 6వ విడతలో 2 ఎకరాలు ప్రభుత్వం ఇచ్చిందని, తాను ఊరిలో లేని సమయంలో తన భూమి ఆక్రమిస్తున్నారంటూ ఆమె కూలీలతో గురువారం భూమిలో జామాయిల్ మొక్కలు నాటిస్తోంది. విషయం తెలుసుకున్న వెంకటయ్య ట్రాక్టర్‌తో తన కుటుంబ సభ్యులను తీసుకుని పొలంలో ఉన్నవారి మీదకు ఎక్కించే ప్రయత్నం చేయగా వారు తప్పించుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగి కర్రలతో కొట్టుకున్నారు. దీంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే ఇంటూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

కందుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆరాధ్య దైవం దివంగత ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 18న కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వెంగమాంబ కల్యాణ మండపంలో వర్ధంతి సభ, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు, నందమూరి అభిమానులు అధికసంఖ్యలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, కొత్తూరి వెంకటసుధాకర్, మురారిశెట్టి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యులుగా చేరాలి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కావలి: సింగమనేని శేషగిరికి టీడీపీ శాశ్వత సభ్యత్వ కార్డు అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ మునునూరుకు చెం దిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సింగమనేని శేషగిరి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. మునునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సభ్యత్వ కార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను అభినందిస్తూ ఉత్సాహవంతులు టీడీపీ శాశ్వత సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునునూరు నేతలు పాల్గొన్నారు.

రైల్వే బిట్రగుంటకు పూర్వ వైభవం తీసుకువస్తాం

●బిట్రగుంట : రైల్వే బిట్రగుంటకు త్వరలో పూర్వవైభవం తీసుకువస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట క్రీడామైదానంలో యంగ్‌లైన్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిట్రగుంట రైల్వేప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటుచేసేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రతిపాదన చేశామని అన్నారు. రైల్వే ఆర్‌ఓహెచ్ ఏర్పాటుకు దాదాపు పూర్తి కావచ్చిందని త్వరలో శుభవార్త వింటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు గండూరి మంజుల, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, టీడీపీ నేతలు ఎం నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వ రరెడ్డి, ఎల్ సుధీర్‌బాబు, యర్రం వేంకటేశ్వర్లు రెడ్డి, ముంతాల వెంకయ్య, కాంద్ర రఘురామనాయుడు, యంగ్‌లైన్స్ సభ్యులు తదితరులు ఉన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వాలపై శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే కాకర్ల



ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నుంచి సభ్యత్వ కార్డు అందుకుంటున్న శ్రీకాంత్‌యాదవ్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు గురువారం వింజమూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం అందుకున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్ యాదవ్‌తో పాటు జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, రామాపురంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేష్, వరికుంటపాడుకు చెందిన బూత్ ఇన్‌చార్జి పొద మాధవరావు, అశోక్‌నగర్‌కు చెందిన వడ్లమూడి నాగేంద్ర సభ్యత్వ నమోదు కార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వంపై నాయకులు శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రస్తుతం శాశ్వత సభ్యత్వం అందుకోవడం ఎంతో అభినందనీయమన్నారు.

●సీతారామపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ మండల ఉపాధ్యక్షులు సోమనబోయిన రాజశేఖర్ టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



ఉదయగిరి: క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్‌లో దేకూరుపల్లి, బిజ్జంపల్లి జట్లు తలపడగా, దేకూరుపల్లి జట్టు ప్రథమ, బిజ్జంపల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. వారికి నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కాకు వెంకటయ్య, నాయబ్, బాషామొహిద్దీన్, కేవీ కృష్ణ, గ్రామపెద్దలు రాజగోపాల్‌రెడ్డి కల్లూరి రవీంద్రారెడ్డి, వీర్ల తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: మండలంలోని కొత్తపేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గురువారం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాళ్లూరి దయానందం, ఐటీడీపీ కోఆర్డినేటర్ వెంగళరావు, గ్రామపెద్దలు మాల్యాద్రి, వెంగళరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని పడమటి కంబంపాడులో సంక్రాంతి సందర్భంగా హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో డాక్టర్ జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు రొండ్ల వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళి, సుదాకర్, నారసింహరెడ్డి పాల్గొన్నారు.

తరుణవాయిలో సంగమేశ్వరుడి విడిది

సంగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గిరి ప్రదక్షణకు బయలుదేరిన సంగమేశ్వరస్వామి గురువారం ఉదయం తరుణవాయి గ్రామంలో విడిది చేశారు. కొరిమెర్ల, తలుపూరుపాడులో గ్రామోత్సవం పూర్తిచేసుకుని తరుణవాయికి చేరింది. రాత్రికి తరుణవాయి గ్రామంలో గ్రామోత్సవం పూర్తయిన తరువాత ఉత్సవం శుక్రవారం ఉదయం సంగంకు చేరుతుంది. అనంతరం సంగం పురవీధుల్లో గ్రామోత్సవం పూర్తిచేసుకుని ఆలయానికి చేరనుంది.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం

మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న పోలేరమ్మతల్లి ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకు బుధవారం అర్ధరాత్రి పోలేరమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) పట్టణ కలుగోళమ్మపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుగ్గిశెట్టి మాధవి, జ్వాలా రామ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు అమరా వేదగిరి, భవనాశి కృష్ణస్వామి, వేమా ప్రకాశం, కల్యాణ్ చక్రవర్తి, బొగ్గవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలిగిరి మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రగతి పథంలో పల్లెలు

ముమ్మరంగా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం పల్లె ప్రజల ఆనందం



గన్నేపల్లి ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు



దుత్తలూరు మండలం జంగాలపల్లిలో వేసిన సిమెంట్‌రోడ్డు

ఉదయగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్‌రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 285 సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం పల్లె ప్రగతిని గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరుతుండడంతో గ్రామాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించింది. ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి ప్రగతిని దూరం చేసింది. ఐదేళ్ల పాలనలో గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. మురుగు కాలువల్లేక చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరంతా రహదారులు, ఇళ్ల వద్ద నిలిచి అపరిశుభ్రతతో గ్రామీణప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్ రోడ్ల మంజూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో ప్రజలు పడుతున్న బాధలను గుర్తించింది. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈమేరకు పల్లెపండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్‌రోడ్లు మంజూరు చేయించారు.

శరవేగంగా పనులు : మణికుమార్, పంచాయతీరాజ్ డీఈఈ

నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శరగవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గానికి అత్యధికంగా రూ.19.26 కోట్ల నిధులతో 334 సీసీ రోడ్లు మంజూరయ్యేలా కృషి చేశారు. ఇప్పటికే 285 రోడ్లు పూర్తిచేశాం. మిగిలిన రోడ్ల నిర్మాణాలు సైతం త్వరలో పూర్తి చేస్తాం.

అప్రమత్తతతోనే రోడ్డుప్రమాదాల నివారణ సాధ్యం

● ఎంవీఐ రాములు



ఆత్మకూరు: రహదారి భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఆత్మకూరు ఎంవిఐ రాములు తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడుపుతున్న సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అతివేగం అనర్థదాయకమని, అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ఏటా భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, సరైన పత్రాలు లేకపోవడం, మద్యం తాగడం తదితర అంశాలపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారంటే అందుకు కారణం రహదారి ప్రమాదాలను నివారించేందుకేనన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా, ఏఎంటి రాజకుమార్, ఏఎంఎఫ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో వాహనాలను నడపాలి : సీఐ

●ఉదయగిరి: డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ ఎస్.వెంకటరావు సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు అజాగ్రత్తగా ఉండకూడదని, ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఈ భద్రతా మాసోత్సవాలు వచ్చేనెల 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. అనంతరం డిపో యాజమాన్యం సీఐ, ఎస్ఐలను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది, యూని యన్ నేతలు పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్ శ్రేయస్కరం

●కావలి: ఏకాగ్రతతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని కావలి డీఎస్పీ పీ శ్రీధర్ తెలిపారు. కావలి ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత డ్రైవింగ్ విధానాలు పాటించకపోతే ప్రయాణికుల కుటుంబాలతో సహా డ్రైవర్ కుటుంబం కూడా అవస్థలకు గురికావల్సి వస్తుందన్నారు. ప్రమాదాలు జరిగితే ఆర్టీసీ సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. డిపో మేనేజరు శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించటంలో డ్రైవర్‌తోపాటు సదరు బస్సు కండక్టర్ కూడా బాధ్యత ఉంటుందన్నారు. బస్సుల కండిషన్ల విషయంలో మెకానిక్‌ల పాత్ర కూడా కీలకమని వారికి కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్లకు తరచూ వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, డిపో అసిస్టెంట్ మేనేజరు(ట్రాఫిక్) కల్పనారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఖాదర్‌మొహిద్దీన్, ట్రాఫిక్ సూర్‌వైజర్ రామకృష్ణ, మెకానికల్ సూపర్‌వైజర్ శీనయ్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ డీ. రవిప్రకాష్, ఒకటో పట్టణ ఎస్ఐలు జానకి రామిరెడ్డి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం



చిన్నారులకు బియ్యం, నిత్యావసరాలు అందచేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కావలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలను చదివించి వారిని రక్షిద్దాం అని కావలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. కావలి పట్టణ శాంతినగర్‌లో ఉన్న జేమ్సు బాలికల హోమ్‌లో ఉన్న యారం ప్రశాంతి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆ హోమ్‌లో ఉన్న బాలికలకు బియ్యం, నిత్యావసరాలు అందచేశారు. సీఐ మాట్లాడుతూ బాలికలను చదివించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. లోక్‌సత్తా సభ్యుడు మాలకొండారెడ్డి మాట్లాడుతూ బాలికల రక్షణకోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌ల ద్వారా రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దేవిక, జేమ్సు బాలికల హోమ్ నిర్వాహకులు మార్క్, నోటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

మర్రిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా ఆక్రమణలు శీర్షికన ఈనెల 7వతేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండలంలో అక్రమార్కులు ప్రభుత్వ భూముల ఆక్రమణకు గొడవలు పడుతూ నిత్యం పోలీస్ స్టేషన్‌లకు పంచాయితీలు చేరుతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచు రితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి గురువారం పొంగూరు రెవెన్యూలోని 1011లో అక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటుచేశారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు అనీల్ కుమార్ హెచ్చరించారు.



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

కుష్టు వ్యాధిగ్రస్థుల సర్వేపై అవగాహన



కలిగిరి: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో గురువారం వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి కుష్ఠువ్యాధిగ్రస్థుల సర్వేపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరిశీలించాల్సి ఉందన్నారు. కుష్ఠు లక్షణాలు ఉన్న అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీ వైద్య కేంద్రంలో సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కమిటీ సమావేశం

స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్యవైద్యకేంద్రానికి కావలసిన వసతులు, అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజారు కావాలని కోరారు.

● ఉదయగిరి : మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించే అనుమానిత ఇంటింటా కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారిణి వినీత పేర్కొన్నారు. గురువారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వే బృందం ప్రతిఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరీక్షించి శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలను గుర్తించి నమోదు చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



ఆత్మకూరు : వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆత్మకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలో సాగులో ఉన్న వరి పంట పొలాలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత శ్రీలక్ష్మీ మాట్లాడుతూ వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. గత ఏడాది నవంబరు 15వ తేదీకి ముందుగా రైతులు వరినాట్లు వేయడంతో పంట ఎదుగుదలలో వ్యత్యాసం వచ్చిందన్నారు. ముందుగా వెన్ను రావడం, దుబ్బలా ఉన్న మొలకలు వివిధ దశల్లో వంగిపోవడం జరిగిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకొనుటకు రైతులు యూరియా 300 కిలోలు, పొటాష్ 15కిలోలు పది రోజుల వ్యవధిలో రెండుసార్లు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీ మాధవి, ఆత్మకూరు ఏడీఏ వి దేవసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం సాగులో ఉన్న వరి, ఉలవ పంటలను మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పంటలకు సోకిన తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం సచివాల యాల్లో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ చల్లా పూజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : వరి సాగులో తెగుళ్ల నివారణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారిణి రజిని రైతులకు సూచించారు. గురువారం ఆమె పెద్దహబ్బీపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై వరి సాగులో మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 8 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా

●షేక్ ఫిరోజ్, విద్యుత్ ఏఈ, లింగసముద్రం



లింగసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్‌ను రెండు విడతలుగా కాకుండా పగలు 8 గంటల పాటు నిరంతరం సరఫరా చేస్తున్నామని మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్ తెలిపారు. అలాగే గ్రామాల్లో కూడా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

? మండలంలో రైతులకు ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా ఇస్తున్నారు.

! ప్రతిరోజూ పగలు 8 గంటలు ఇస్తున్నాము. ఉదయం 8.45 గంటల నుండి సాయంత్రం 4.45 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నాము.

? రైతులకు త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని రోజులలో ఇస్తారు.

! రైతులు ఉదయం చెబితే సాయంత్రానికి ఇస్తాము.

? గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సరఫరా ఎలా చేస్తున్నారు.

! మండల కేంద్రం లింగసముద్రంతో పాటు గ్రామాలకు కూడా 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాము.

? మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఎన్ని ఉన్నాయి.

! నాలుగు ఉన్నాయి. లింగసముద్రం, మొగిలిచెర్ల, వీఆర్ కోట, చినపవని గ్రామాలలో సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

? సిబ్బంది కొరత ఉందా.

! సిబ్బంది కొరత లేదు. ఎక్కడైనా ఏదైనా అవాంతరం వస్తే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరిస్తున్నాం.

న్యూస్ బాక్స్

క్రికెట్ కిట్ల అందజేత

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జనసేన ఆధర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకులు గుమ్మలంపాటి వెంగళరావు తన స్వంత నిధులతో గ్రామంలోని యువకులతో పాటు విద్యార్థులకు తన వంతు దాతృత్వంగా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తినవారిపల్లిలో వైద్యశిబిరం

వింజమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాకలికొండ పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లి గ్రామంలో చాకలకొండ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గతంలో ఆ గ్రామ ప్రజలు సీజనల్ జ్వరాలకు గురయ్యారనే ఫిర్యాదు మేరకు గురువారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కావలిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో నెల్లూరు నగరంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహాయ సహకారాలందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరు పాల్, కృష్ణమోహన్, బీ కృష్ణయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల ప్రారంభం

జలదంకి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జలదంకి పంచాయతీలోని గమళ్ళపాలెం, అరుంధతీవాడల్లో రూ.60లక్షల ఉపాధిహామీ నిధులతో పలు సిమెంటురోడ్ల నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. టీడీపీ మండల అధ్యక్షుడు పి మధుమోహన్‌రెడ్డి టెంకాయకొట్టి పనులు ప్రారంభించారు. అదేవిధంగా మండ లంలోని కొత్తపాలెం గ్రామంలో కూడా సిసిరోడ్ల పనులను టీడీపీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డిలు ప్రారంభించారు. ఈ పనులు పిఆర్ఏఈ వాణి, గ్రామసచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ఎక్కడంటే అక్కడ వాహనాలు ఆపడం సరికాదు

బిట్రగుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ఎక్కడంటే అక్కడ వాహనాలు నిలపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎన్‌హెచ్ మొబైల్ సిబ్బంది అన్నారు. బోగోలు మండలం కడనూతల జాతీయ రహదారి చెరువు గట్టు వద్ద ప్రయాణికులు కొందరు కార్లను నిలుపుకుని సేదతీరుతుండటం చూసి గురువారం హెచ్చరించారు.

రూరల్, కోవూరు, సర్వేపల్లి

అక్రమ లేఅవుట్లే ఉండకూడదు

అనుమతుల్లేని భవనాలు కూల్చేయండి

నుడా, కార్పొరేషన్ అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం

నిర్లక్ష్యం వద్దంటూ టీపీవోకి హెచ్చరిక

నెల్లూరు(సిటీ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడా అక్రమ లేఅవుట్లు ఉండకూడదని, అన్నిటికీ కచ్చితమైన అనుమతులుండాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో నుడా, ఎన్ఎంసీ అధికారులతో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అక్రమ లేఅవుట్ అనేదే ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. అదేవిధంగా సిటీ పరిధిలో కార్పొరేషన్ అనుమతి లేకుండా ఒక్క భవనం కూడా కనపడకూడదన్నారు. అలాంటివి ఎక్కడైనా ఉంటే వెంటనే నేలమట్టం చేయాలని ఆదేశించారు. సచివాలయాల వారీగా భవనాలను లెక్కించి అన్నిటికీ పన్ను విధించాలని సూచించారు. భవన నిర్మాణాలకు దరఖాస్తు పెట్టుకున్న 24 గంటల్లో అనుమతులు మంజూరు చేయాలని, అనుమతులు ఇవ్వలేకపోతే అందుకు గల కారణాలు తెలియచేయాలనానరు. నుడా పరిధి లోనూ అక్రమ లేఅవుట్లు ఉండరాదని హెచ్చరించారు. కాగా, బాలాజీనగర్‌లో అనుమతుల్లేని భవనంపై మీరెందుకు చర్యలు తీసుకోవడం లేదని టీపీవోని మంత్రి ప్రశ్నించారు. వారం రోజుల క్రితమే ఫిర్యాదులు అందినా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. తన వద్ద నిర్లక్ష్యం పనికిరాదంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇదే విషయమై నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి కూడా టీపీవోని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, నగర కమిషనర్ సూర్యతేజ, కార్పొరేషన్, నుడా అధికారులు పాల్గొన్నారు. కాగా, భవనాల కూల్చివేతకు సంబంధించి కలెక్టర్, ఎస్పీకి మంత్రి పలు సూచనలు చేశారు.


సమీక్షలో కలెక్టర్‌తో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

షాపింగ్ కాంప్లెక్స్‌ల సంగతేంటి?

- పేరుకుపోతున్న అద్దె బకాయిలు
- వసూళ్లకు కదలని ఆర్‌ఐలు
- షాపుల నిర్వాహకుల్లో ఎక్కువమంది బినామీలే!
- తనిఖీల్లో తేల్చినా చర్యలేవి?
- తాళాలేసి ఆపై వదిలేసిన వైనం
- కార్పొరేషన్‌కు దక్కని రాబడి

నెల్లూరు (సిటీ), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు నగర పాలక సంస్థకు ఆదాయం తెచ్చిపెట్టేది రెవెన్యూ విభాగం. ఆస్తి పన్ను విధించడంతోపాటు దానిని వసూలు చేయడమేకాక కార్పొరేషన్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి అద్దెలు వసూలు చేయడమూ ఆ విభాగం బాధ్యత. అయితే దుకాణ సముదాయాల నుంచి బాడుగ వసూలు చేయడంలో ఆర్‌ఐలు విఫలమవడంతో బకాయిలు పేరుకుపోయాయి. నెల్లూరు నగర పాలక సంస్థకు 12 షాపింగ్ కాంప్లెక్సు లున్నాయి. వాటిలో 223 దుకాణాలున్నాయి. వీటిని బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించారు. వారి నుంచి నెలవారీ అద్దెను వసూలు చేయాల్సి ఉంది. అయితే అధికారులు సక్రమంగా వసూళ్లు చేయకపోవడం తో ఏనెలకానెల బకాయిలు పెరిగిపోతున్నాయి. కొందరు వ్యాపారులు ప్రతి నెలా సక్రమంగా అద్దె చెల్లిస్తుండగా మిగిలిన వారు వివిధ కారణాలతో వాయిదా వేస్తున్నారు. ఆ విధంగా ఇప్పటి వరకు రూ.1.60 కోట్లు బకాయి వసూలు కావలసి ఉంది. ఇదిలా ఉండగా మొత్తం దుకాణాల్లో సుమారు 50 దుకాణాలను మొండి బకాయిలుగా అధికారులు గుర్తించారు. మరో 15 షాపుల అద్దెదారులు అందుబాటులో లేరని తేల్చారు. వారి నుంచి రూ.లక్షల్లో బకాయిలు కార్పొరేషన్‌కు చేరాల్సి ఉంది. ఉన్నతాధికారులు సమీక్ష జరిపినప్పుడు నోటీసులు జారీ చేస్తున్న ఆర్‌ఐలు ఆపై శ్రద్ధ వహించకపోవడంతో షాపింగ్ కాంప్లెక్స్‌ల బకాయిలు పేరుకుపోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


గాంధీబొమ్మ వద్దనున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్

బినామీలే ఎక్కువ

నగరంలోని గాంధీబొమ్మ, చిన్నబజారు, సుబేదార్‌పేట, స్టోన్‌హౌస్‌పేట, ఏసీ బొమ్మ, మద్రాసు బస్టాండ్ వంటి ముఖ్య ప్రాంతాల్లో కార్పొరేషన్ దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో ఎక్కువ మంది బినామీలే కావడం గమనార్హం. ఈ విషయం కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైంది. వేలంపాటలో దుకాణాలు పొందిన వారు వాటిని మరొకరికి అద్దెకు ఇస్తున్నారని తేలింది. కార్పొరేషన్‌కు గోరంత బాడుగ చెల్లించి బినామీల నుంచి కొండంత వసూలు చేస్తున్నారని గుర్తించారు. దీంతో బినామీలందరూ షాపులు ఖాళీ చేయాలని ఆదేశిస్తూ దుకాణాలకు తాళాలేశారు. కానీ కొద్ది రోజులకే మళ్లీ ఆ దుకాణాలన్నీ తెరుచుకున్నాయి. దీని వెనుక ఏం జరిగిందన్నది దేవుడికే ఎరుక!. దుకాణాల ద్వారా నగర పాలక సంస్థ పెద్ద మొత్తంలో రాబడిని కోల్పోతోందని తెలిసినా ఉన్నతస్థాయిలో ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.




చిన్నబజార్‌లోని నగర పాలక సంస్థ దుకాణ సముదాయం

ఇంకెన్నాళ్లీ కష్టాలు?

రాష్ట్రంలోనే నాలుగో అతిపెద్ద నగరం నెల్లూరు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల వరుసలో ముందున్నది. సుమారు పది లక్షల జనాభా ఉన్న నగరంలో ఇప్పటికీ తూర్పు, పడమర ప్రాంతాలకు వెళ్లాలంటే రైల్వే గేట్లు దాటాల్సిందే. ఒక్కసారి రైల్వే గేట్ పడితే వాహనాలు బారులు తీరతాయి. కొన్నిసార్లు రైల్వే గేట్లు మరమ్మతులు చేస్తున్నప్పుడు వాహనదారులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీనిమూలంగా వాహనదారులకు సమయం వృథాతో పాటు అదనంగా ఇంధన ఖర్చులు, వాయుకాలుష్యం పెరుగుతోంది. ఇటీవల విజయవాడ-గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ కూడా ఆపరేషన్‌లోకి వచ్చింది. దీంతో రైల్వే ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడు ఒకసారి గేటు పడితే మూడు, నాలుగు రైళ్లు వెళ్లే దాకా నిరీక్షించాల్సిందే.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)


కొండాయపాళెం రైల్వే గేటు వద్ద వాహనాల రద్దీ

- ట్రాఫిక్ చక్రబంధంలో నగరవాసులు
- రైల్వే గేటుపడితే బారులు తీరాల్సిందే!
- కొలిక్కిరాని ఆర్వోబీల నిర్మాణ ప్రక్రియ
- చొరవచూపని అధికార యంత్రాంగం

నగరంలో ప్రస్తుతం అయ్యప్పగుడి సర్కిల్ వద్ద మాత్రమే రైల్వే ఫ్లైఓవర్ ఉంది. మాగుంట లేఅవుట్, రామలింగాపురం, విజయమహల్ గేట్, ఆత్మకూరు బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్నాయి. ఇక ప్రధానమైన బీవీనగర్, కొండాయపాలెం గేటు, విజయమహల్ గేటు, రంగనాయకుల పేట వద్ద మాన్యువల్ రైల్వే గేట్లు ఉన్నాయి. వర్షాకాలం వస్తే అండర్ బ్రిడ్జిలు నీటితో నిండిపోయి, రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఆ సమయంలో అయ్యప్పగుడి ఫ్లైఓవర్ ఒక్కటే నగరానికి దిక్కు. తూర్పు, పడమర ప్రాంతాల వాహనదారులు అటు ఇటు వెళ్లాలనుకుంటే కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సి వస్తోంది. అందులోనూ ఇటీవల నగరంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతమున్న రోడ్లే సరిపోవడం లేదు. అటువంటిది రైల్వే క్రాసింగ్‌ల మూలంగా సమస్య మరింత తీవ్రమవుతోంది.

● ఏళ్ల నాటి సమస్య

2014-19 మధ్య అప్పటి తెలుగు దేశం ప్రభుత్వంలో నగరంలో రైల్వే ఫ్లైఓవర్ల నిర్మాణానికి సన్నాహాలు జరిగాయి. బీవీనగర్, కొండాయపాలెం గేటు, ముత్యాలపాలెం వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి జిల్లా అధికారులు రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపారు. అందులో బీవీనగర్, కొండాయపాలెం వద్ద ఫ్లైఓవర్లు నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలోనే ఆ రెండు చోట్ల సాయిల్ టెస్ట్ (మట్టి పరీక్షలు) కూడా నిర్వహించారు. దీంతో త్వరలోనే ఏళ్ల నాటి సమస్య పరిష్కారమవుతుందని నగరవాసులు సంబరపడ్డారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. రైల్వే ఫ్లైఓవర్ల గురించి ఉన్నతస్థాయిలో చర్చించే పరిస్థితి లేకుండా పోయింది. రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం గతిశక్తి పథకం కింద జిల్లాలో పలు ప్రాంతాల్లో రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది. అందులో నెల్లూరులో రెండు చోట్ల నిర్మించేందుకు అనుమతుల లభించాయి. అయినా నేటికీ ఈ ఫ్లైవోవర్ల నిర్మాణ ప్రక్రియ ఓ కొలిక్కి రాలేదు.

● పూర్తయిన జాయింట్ సర్వే

బీవీ నగర్, కొండాయపాలెం వద్ద రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి సాయిల్ టెస్ట్ ఫలితాలు అనుకూలంగా వచ్చాయి. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం ఆర్‌అండ్‌బీ, రైల్వే శాఖల అధికారులు ఆ ప్రాంతాల్లో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. రైల్వే ట్రాక్‌కు తూర్పు, పడమర ప్రాంతాల్లోని రోడ్ల విస్తీర్ణాన్ని సర్వే చేశారు. ఈ నివేదికను రైల్వే ఉన్నతాధికారులకు పంపారు. సాధారణంగా రైల్వే ఫ్లైవోవర్ నిర్మించాలంటే ట్రాక్ నుంచి కనీసం 300 మీటర్ల రోడ్డు ఉండాలి. కానీ బీవీ నగర్, కొండాయపాలెం వద్ద జీఎన్‌టీ రోడ్డు నుంచి రైల్వే ట్రాక్ అంత దూరం లేదని తేల్చారు. అయితే 200 మీటర్ల దూరం ఉన్నా ఫ్లైవోవర్ నిర్మాణం పూర్తి చేయవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు. దీనిపై రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే వారితో జిల్లా నుంచి చర్చించే వారు లేకపోవడంతో సమస్య కొలిక్కి రావడం లేదు.

రైల్వే అధికారులు నిర్ణయం తీసుకోవాలి

నెల్లూరు నగరంలో కొండాయపాలెం గేటు, బీవీ నగర్ ప్రాంతాల్లో రైల్వే ఫ్లైవోవర్ల నిర్మాణానికి సంబంధించి రైల్వే అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ పూర్తి చేశాం. ఆ వివరాలను రైల్వే ఉన్నతాధికారులకు అందజేశాం. స్థలం అందుబాటును బట్టి ఫ్లైవోవర్ నిర్మించాలా లేదా అండర్ బ్రిడ్జీ నిర్మించాలా అన్నది వారు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- మురళీకృష్ణ, ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ



హెల్మెట్ పెట్టుకోండి ప్రాణాలు కాపాడుకోండి

మనుబోలు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాదారుడికి హెల్మెట్ ఎంత అవసరమో ఎస్ఐ శివరాకేష్ వీరంపల్లి గ్రామస్తులకు గురువారం వివరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వీరంపల్లి పంచాయతీలో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి గ్రామస్తులను సమావేశపరిచి హెల్మెట్ ధరించడం, దాని ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొట్టేళ్ళ ప్రసాద్, రఘురామయ్య, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మనుబోలు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక క్రీడామైదానంలో ఈనెల 11నుంచి ఎన్ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం 8గంటల నుంచి పోటీలు ప్రారంభించారు. ముందుగా దాములెవన్స్, ఈస్ట్ స్ట్రీట్ లెవన్స్‌తో పోటికి దిగింది. నిర్ణీత 8ఓవర్లకు 9వికెట్ల తేడాతో ఈస్ట్‌స్ట్రీట్స్ లెవన్స్ గెలిచింది. అలాగే కొమ్మలపూడి వీసీటీసీ జట్టుపై బద్వేలు జట్టు పోటీపడగా 7వికెట్ల తేడాతో బద్వేలు జట్టు గెలిచింది. జైభీమ్ కొలనుకుదురు జట్టుతో, సీపీఎల్ డ్రాగన్స్ జట్టు రంగంలోకి దిగింది. 12 పరుగుల తేడాతో జైభీమ్ కొలనుకుదురు జట్టు విజయం సాధించింది. మడమనూరు, అక్కంపేట జట్లు పోటీపడగా, మడమనూరు జట్టు 20 పరుగుల తేడాతో గెలుపొందింది. అనంతరం కొండూరు జూనియర్స్, సావిత్రిపురం జట్లు పోటీల్లో కొండూరు జూనియర్స్ 6వికెట్ల తేడాతో గెలిచింది. బాయ్‌లెవన్స్, శ్రీకృష్ణ కట్టువపల్లి జట్లు తలపడగా బాయ్‌లెవన్స్ 10వికెట్ల తేడాతో గెలుపొందింది. చివరగా కాగితాలపూరు, ఎంజీసీటీ మనుబోలు జట్లు పోటికి తలపడగా 25పరుగుల తేడాతో ఎంజీసీటి మనుబోలు విజయం సాధించినట్లు పోటీల నిర్వాహకులు సాయి, శ్రీను, సతీష్ తదితరులు తెలిపారు.



'కుష్టు' సర్వే శిక్షణ

ఇందుకూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20 నుంచి జరిగే కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమంపై మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో గురువారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో వైద్యం అందించడమే లక్ష్యంగా సర్వే సాగాలని సూచించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, నొప్పిలేని బొడిపెలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కుదిబ్బడ, కాళ్లు చేతులు తిమ్మిర్లు, చల్లని వేడి వస్తువులను గుర్తించలేకపోవడం వంటి లక్షణాలను పరిగణలోకి తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.



సర్వే కరపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్

కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం

పొదలకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్‌సీడీసీ సర్వే కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ లెప్రసీ సర్వే ఈనెల 20వతేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగుతుందని డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎం.మోహన్‌రావు తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులు వాడితే అంగవైకల్యాన్ని నివారించవచ్చునని వైద్యాధికారి కిరణ్ రిషిత అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టీ రవికుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, మస్తాన్‌బి, నరసమ్మ, ఆరోగ్య సహాయకులు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలులో భూముల పరిశీలన

మనుబోలు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఆర్డీవో నాగసంతోష అనూష గురువారం మండలంలోని మనుబోలు, గురివిందపూడి రెవెన్యూ పరిధిలోని మూడు వ్యవసాయేతర భూముల అనుమతి కోసం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వ్యవసాయ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు వ్యవసాయేతర భూములుగా అనుమతి కోరేందుకు రైతులు తహసీల్దార్‌కు దరకాస్తు చేసుకున్నారు. దీంతో అనుమతి ఇచ్చేందుకు ఆర్డీవో క్షేత్రస్థాయి పరిశీలన చేసి రికార్డుల ప్రకారం హద్దులు, భూమి వివరాలను పరిశీలించారు. ఇతర వివరాలను తహసీల్దార్ సిహెచ్, సుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనువాసులు, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా వన మహోత్సవం

రాపూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ముక్కనుమ సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో గురువారం సాయంత్రం శ్రీఆదిలక్ష్మీ అమ్మవారికి వన మహోత్సవం వైభవంగా జరిగింది. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

కోటి సభ్యత్వాలు హర్షణీయం

● వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు ఒక కోటి పూర్తి కావడంపై ఆ పార్టీ జిల్లా అధ్యక్షు డు, వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదులో నెల్లూరు సిటీ, ఆత్మకూరు నియోజకవర్గాలు రాష్ట్రంలోనే మొదటి, రెండవ స్థానాల్లో నిలవడం సంతోషకరమన్నారు. టీడీపీపై ప్రజలకు ఉన్న విశ్వసనీయతకు ఈ సభ్యత్వాలు నిదర్శనమని తెలిపారు. ఈ నెల 19వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

19న వేమన జయంతి వేడుక

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంతం వారి ఆధ్వర్యంలో ఈనెల 19న ప్రజాకవి వేమన జయంతి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహక కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ రోజు మధ్యాహ్నం 12గంటలకు మాగుంట లేఅవుట్‌లోని అనిల్‌గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపింది. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొంటారని పేర్కొంది. ఉదయం 9 గంటలకు రథోత్సవం జరుగుతుందని, ప్రజలందరూ తరలిరావాలని కమిటీ కోరింది.

చికెన్ వ్యర్థాల వాహనం స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 16 : చికెన్ వ్యర్థాలు 40 టన్నులతో సంగం నుంచి బుచ్చికి వస్తున్న వాహనాన్ని బుచ్చిలోని టోల్‌గేట్ వద్ద గురువారం ఎస్ఐ సంతోష్‌రెడ్డి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వాహనంలోని వ్యర్థాలను నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. చికెన్ వ్యర్థాలను రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు : ఎంవీఐ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, దానిని నివారించాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచంద్రరావు సూచించారు. నగరంలోని ఆర్టీసీ నెల్లూరు-1వ డిపో గ్యారేజ్‌లో గురువా రం రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరు ప్రమాదరహితంగా డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం మురళీ కృష్ణ, ఆర్టీసీ సిబ్బంది, పాల్గొన్నారు.

వరి పైరులో జింకు ధాతు లోపం

● వ్యవసాయాధికారి రఘునాథరెడ్డి

ఇందుకూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పున్నూరు, లేబూరు బిట్ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి డీ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పొలాల్లో జింక్ ధాతు లోపాన్ని గమనించామని ఆయన తెలిపారు. భాస్వరం (దుక్కి పిండి) అధిక మోతాదులో వినియోగించడం, చౌడు నేలలో పంట వేయడం, పొలాల్లోని మురుగునీరు బయటకు పోయే వసతి లేకపోవడం వల్ల జింకు ధాతు లోపం ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల వరిపైరు సరిగ్గా ఎదుగుదల లేకపోవడం, పిలకలు తక్కువగా రావడంతో దిగుబడి తగ్గుతుందని చెప్పారు. మోము ఆకుకింద మూడవ ఆకు పసుపు పచ్చగా మారి, తుప్పు మరకలు కనిపిస్తాయన్నారు. దీని నివారణకు ఒక ఎకరా పొలానికి 21శాతం జింక్ సల్ఫేట్, ఒక కేజీ యూరియాను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, 12శాతం ఈడీటీఏ, జింక్ పొడి 200 గ్రాములు కలిపి ఒక ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు. చౌడు నివారణకు 250కిలోల నుంచి 500 కిలోల వరకు జిప్సం ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పున్నూరు పంచాయతీ కార్యదర్శి పీ సుమలత, వీఏఏలు నరేష్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై రైతులకు అవగాహన

తోటపల్లిగూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎలుకల నివారణపై రైతులకు మాచర్లవారిపాలెం, వరకవిపూడి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ రైతులకు వివరించారు. ఎలుకల మందును ఎలా వినియోగించాలో తెలిపి రైతులకు ఉచితంగా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. వ్యవసాయాధికారిణి వీవీ శిరీషరాణి మాట్లాడుతూ అధికంగా యూరియా వాడకంతో చీడపీడల బెడద ఎక్కువ అవుతుందని, తాలుగింజలు ఏర్పడి తద్వారా రైతుకు దిగుబడి తగ్గుతుందన్నారు. అధిక నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలని, వరి పైరులో తెల్లతెగుల నివారణ కోసం క్లోరోఫైరీఫాస్ 2ఎంఎల్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. మండలంలోని అన్ని సొసైటీలకు యూరియాను సరఫరా చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


ఎలుకల నివారణ మందుతో రైతులు, ఏడీఏ రాజ్‌కుమార్

కేన్సర్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మెడికవర్ ఆసుపత్రి ఉచిత కేన్సర్ వైద్య పరీక్షల పోస్టర్‌ను గురువారం కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్వైకల్ కేన్సర్ అవగాహన నెలగా జనవరిని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందన్నారు. మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి మాట్లాడుతూ రూ.5100 విలువైన కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌బాబు, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు విస్తరణ పనులకు స్తంభాలు మార్చుతున్నందున శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. అరవింద నగర్, ప్రశాంతి నగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, సింహపురి కాలనీ, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.



పులికాట్ పిలుస్తోంది!

సంక్రాంతి సంబరాలు ముగిసే వేళకి పక్షుల పండుగ మొదలవుతోంది. ఫ్లెమింగో ఫెస్టివల్‌కి వచ్చేవారికి ఈ ఏడాది పులికాట్ కనువిందు చేయనుంది. వరుస తుపానులు తెచ్చిన వానలవల్ల పులికాట్ లోకి నదులు మోసుకొచ్చిన మంచినీటికి, సముద్రపు ఉప్పునీరు ఎదురొచ్చి స్వాగతం పలికింది. ఈ సంగమంతో మత్స్యసంపద వృద్ధి చెందింది. రొయ్యలూ, చేపలూ దండిగా ఉండడంతో వలస పక్షులు కూడా పెద్ద సంఖ్యలో ఈ ఏడాది పులికాట్‌ను ఆశ్రయించాయి. ప్రస్తుతం వివిధ జాతుల పక్షులు లక్షకు పైగా పులికాట్‌లో ఉన్నట్టు పక్షుల రక్షిత కేంద్రం సిబ్బంది అంచనా వేశారు. ఆ విశేషాలు.. సచిత్రంగా..

- 8లో

రేపటి నుంచే పక్షుల పండుగ

- సూళ్లూరుపేట కేంద్రంగా ప్రారంభ, ముగింపు వేడుకలు
- నేలపట్టు, అటకానితిప్పలలో వ్యూ పాయింట్లు
- బీవీపాలెంలో పడవ షికారు.. శ్రీసిటీలో వర్క్ షాపు
- 6-7 లక్షల మంది వస్తారని అంచనా
- తిరుపతి, నెల్లూరుల నుంచీ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా శనివారం నుంచి పక్షుల పండుగ జరగనుంది. వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు ఈ వేడుకను ఆపేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులపాట జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను శనివారం ఉదయం సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ ప్రారంభించనున్నారని కలెక్టరు వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ ఏర్పాట్ల గురించి గురువారం మధ్యాహ్నం జేసీ శుభమ్ బన్సాల్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ సెల్వం, టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణమూర్తి తదితరులతో కలిసి కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు.



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న కలెక్టర్

ఐదు చోట్ల ఉత్సవాలు

సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, బీవీపాలెం, శ్రీసిటీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తారు. పక్షుల అభయారణ్యమైన నేలపట్టు, అటకానితిప్ప ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పెలికాన్ కొంగలను మరో ఏడెనిమిది జాతుల విదేశీ పక్షులను వీక్షించొచ్చు. ఇప్పుడు పెలికాన్ కొంగలు గూళ్ల ఏర్పాటు చేసుకునే సమయం కూడా. దీనికోసం ఈ రెండు ప్రాంతాల్లో వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి బైనాక్యులర్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. నేలపట్టులో అదనంగా స్నేక్ షో ఉంటుంది. అటవీశాఖ నుంచీ 50 మంది గైడ్లను నియమించారు. బీవీపాలెం పడవల రేవులో పర్యాటకులు పులికాట్ సరస్సులో షికారు చేయడానికి 35 పడవలు సిద్ధం చేశారు. ప్రతి బోటులోనూ లైఫ్ జాకెట్లు, ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్ల ఉంటారు. ఈ ఐదు చోట్లా వైద్య శిబిరాలు, హెల్ప్ సెంటర్లు, భారీ బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. తిరుపతి నుంచీ పర్యాటక శాఖ ప్యాకేజీ టూర్లు నిర్వహిస్తోంది. వసతికి సూళ్లూరుపేట, తడ, నాయుడుపేట, శ్రీసిటీ ప్రాంతాల్లో హోటళ్ల అందుబాటులో ఉన్నాయి.

శోభాయాత్ర

తొలిరోజు చెంగాలమ్మ ఆలయం నుంచీ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు మూడు రోజులూ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలు కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. వివిధ కళలు, హస్తకళలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. శ్రీసిటీ సెజ్‌లో మూడు రోజుల పాటు పులికాట్ పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. రాష్ట్ర నలుమూలల నుంచీ వివిధ కళలు, హస్తకళల ప్రదర్శనతో పాటు స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, క్రీడలు, వంటలు తదితరాలను ప్రోత్సహించడంపై అధికారులు దృష్టి సారించారు. స్థానికంగా ఆయా రంగాలకు చెందిన వారి ప్రతిభాపాటవాలను వెలుగులోకి తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

ఐదు కేంద్రాలకూ ఇన్‌చార్జులు వీరే

నేలపట్టు- గూడూరు సబ్ కలెక్టర్, అటకానితిప్ప- డీఆర్‌డీఏ పీడీ, శ్రీసిటీ- స్టేట్ సిల్వికల్చరిస్టు, బీవీపాలెం- మత్స్య శాఖ డీడీ, సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ- డ్వామా పీడీ. ఓవరాల్ ఇన్‌చార్జిగా జేసీ శుభం బన్సాల్ ఉంటారు. ఫ్లెమింగో ఫెస్టివల్ కమిటీకి కలెక్టర్ చైర్మన్, ఎస్పీ, అటవీ శాఖ కన్సర్వేటర్ సెల్వం కో చైర్మన్లుగా వ్యవహరిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా షార్ ఎగ్జిబిషన్

ఈసారి ఫ్లెమింగో ఫెస్టివల్‌లో షార్ ప్రధాన భాగస్వామి కానుంది. ప్రయోగించిన రాకెట్ నమూనాలతో పాటు అరుదైన యంత్రాలు, పరికరాలను విద్యార్థుల కోసం ప్రదర్శించనుంది.

6-7 లక్షల మంది వస్తారని అంచనా

చివరిసారి 2020 జనవరిలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజుల్లో ఐదు లక్షల మంది వీక్షించారు. నాలుగేళ్ల విరామం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నుంచీ ఏడు లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా. దీనికనుగుణంగా తాగునీరు, టాయిలెట్ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగో, వెబ్‌సైట్ల ఆవిష్కరణ

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగోను, వెబ్‌సైట్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ శాశ్వతంగా ఉంటుందన్నారు. నేలపట్టు, అటకానితిప్ప, పులికాట్ సరస్సుల పర్యావరణానికి సంబంధించి ఆసక్తి వున్నవారు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకునే వీలు కల్పించామన్నారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌ను విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు, పర్యావరణంపై పనిచేసే సంస్థలతో పాటు ఆట విడుపుగా ప్రతి కుటుంబం సందర్శించాలని కోరారు.

ఎడ్ల పందేల్లో అపశ్రుతి

- ఒకరికి తీవ్ర గాయాలు.. వాహనాల ధ్వంసం





ఎద్దుల తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన పోలయ్య - దెబ్బతిన్న కారు

నాయుడుపేట టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడా ప్రాంగణంలో సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగంగా గురువారం ఎడ్ల పరుగు పందేలు నిర్వహించారు. గతంలో ఎడ్ల పరుగు పందేలు నిర్వహించకపోవడం, ఎడ్లకు సరైన శిక్షణ లేకుండానే పందేలు ప్రారంభించడంతో కొన్ని ఎద్దులు బెదిరిపోయి జనం మీదకు వచ్చాయి. మేనకూరుకు చెందిన పేరంశెట్టి పోలయ్యను ఎద్దు తొక్కేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం పోలయ్యను నెల్లూరుకు తీసుకెళ్లారు. ఎద్దుల తొక్కిసలాటలో కారు, మోటరు సైకిళ్ల ధ్వంసమయ్యాయి.



ద్విచక్ర వాహనాలను తొక్కేసి.. కిందపడిన ఎద్దు

ముక్కంటి అంతరాలయ దర్శన టికెట్ రూ.500



- నేటి నుంచి అమలు కానున్న కొత్త విధానం
- దళారులకు అడ్డుకట్ట వేసేందుకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో అంతరాలయ దర్శనం కోసం రూ.500 టిక్కెట్టును అధికారులు ప్రవేశపెట్టారు. దళారులను అరికట్టేందుకు శుక్రవారం నుంచి అధికారులు సరికొత్త విధానానికి శ్రీకారం పలకనున్నారు. దోష నివారణ క్షేత్రంగా ఆలయం ప్రసిద్ధి చెందడంతో రాహుకేతు పూజలు జరిపించుకునేందుకు.. జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుడిని దర్శించుకునేందుకు విదేశాల నుంచీ భక్తులు విచ్చేస్తున్నారు. క్షేత్రంలో స్వామి అమ్మవార్ల గర్భాలయాలు వేర్వేరుగా ఉంటాయి. అంతరాలయంలోకి వెళ్లి మూలమూర్తులను దగ్గరగా దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. అంతరాలయ దర్శనం కోసం ఇప్పటి వరకు ప్రత్యేక టిక్కెట్టును కేటాయించలేదు. ప్రముఖులు, రాజకీయ నేతలు, సిఫార్సులపై వచ్చేవారు మాత్రమే అంతరాలయ దర్శనం పొందేవారు. ప్రముఖుల ముసుగులో కొందరు దళారులు భక్తులకు అంతరాలయ దర్శనాలు చేయిస్తూ ఇష్టానుసారంగా అక్రమ సంపాదన సాగిస్తుండేవారు. గత వైసీపీ పాలనలో ఈ అంతరాలయ దర్శనం దందాగా సాగింది. అంతరాలయం దర్శనం చేసుకునేందుకు ఎలాంటి టిక్కెట్లు అందుబాటులో లేకపోవడంతో మరోమార్గం లేక చాలామంది భక్తులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇలా రోజున వెయ్యి నుంచి రెండువేల మంది వరకు అంతరాలయ దర్శనాలు చేసుకునేవారు. ఇదంతా దళారులకు డబ్బే. ఇటీవల ఈవో బాపిరెడ్డి దళారులను అరికట్టేందుకు అధికారులతో కలిసి పలుమార్లు కసరత్తు చేశారు. భక్తులతో నేరుగా మాట్లాడారు. ముఖ్యంగా అంతరాలయ దర్శనం కోసమే దళారులను భక్తులు ఆశ్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అంతరాలయ దర్శనం టిక్కెట్టుపై దేవదాయశాఖకు ఈవో ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ.500 అంతరాలయ దర్శన టిక్కెట్టును ప్రారంభించేలా చర్యలుచేపట్టారు. మూడు కౌంటర్లలో శుక్రవారం నుంచి అవసరమైన భక్తులు ఆధార్ కార్డు చూపి అంతరాలయ దర్శనం టిక్కెట్టు కొనుగోలు చేయవచ్చు. ఈ టిక్కెట్లు కౌంటర్ నుంచి దళారుల చేతికి దారి మళ్లకుండా ఆధార్‌లింక్‌ను అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. దీంతో శుక్రవారం నుంచి భక్తులు దళారుల అవసరం లేకుండా సులభంగా దగ్గర నుంచి స్వామి అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

స్వర్ణముఖీ తీరం.. జనసంద్రం





ఏటి పండుగలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న జనం

నాయుడుపేట/టౌన్, జనవరి 16: నాయుడుపేటలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతం జన సంద్రమైంది. రెండో రోజైన గురువారం జరిగిన ఏటి పండుగకు భారీగా జనం తరలివచ్చారు. రంగురంగుల బెలూన్లు, ఆటవస్తువులు, రంగులరాట్నాలు, జెయింట్‌వీల్, నెమలి పడవ, బెలూన్ జారుడుబల్ల తదితర ఆటవస్తువులతో చిన్నారులు సందడిగా గడిపారు. స్వర్ణముఖినదిలో జలకాలాడారు. బంధువులు, స్నేహితులు కుటుంబాలతో సహా కబడ్డీ, రింగ్‌బాల్, ఖోఖో ఆటలాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడుపుతున్నపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని రవాణా శాఖ అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పనిసరి అని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్, ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, మోహన్‌కుమార్, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి వెల్లడి



నాయుడుపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తామని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన వేలకోట్ల అప్పులతో తీవ్ర లోటు బడ్జెట్ ఉందని.. అయినప్పటికీ సీఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందంజలో ఉంచారన్నారు. గత ప్రభుత్వంలో భద్రతలేక పరిశ్రమలు ఎన్నో వెనుతిరిగాయని.. నేడు విస్తారంగా వస్తుండటంతో యువతకు ఉపాధి కలుగుతుందని చెప్పారు. 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఎన్నో భూసమస్యలను పరిష్కరించినట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం తదితరులు పాల్గొన్నారు.

21న ఏకసభ్య కమిషన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ జరపడానికి నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా(విశ్రాంత ఐఏఎస్) నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఈ నెల 21వ తేదీన చిత్తూరుకు రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఎస్సీ కుల సంఘ నాయకులు, ప్రజలతో సమావేశమై వారి అభిప్రాయాలను, అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాకు సంబంధించిన వారు కూడా అక్కడే వినతిపత్రాలు, అర్జీలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

జర్మన్ నర్సింగ్ లాంగ్వేజ్‌పై ఉచిత శిక్షణ

తిరుపతి(వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసిన నిరుద్యోగ యువతకు జర్మనీ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అవసరమైన జర్మన్ నర్సింగ్ లాంగ్వేజ్‌పై ఉచిత శిక్షణ తరగతులను గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి జర్మనీ భాషపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు 9988853335కు సంప్రదించాలని కోరారు.

పక్షుల కిలకిలలే పులికాట్ భాష!

కథనం: దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మంచు కురిసేవేళ పక్షుల కిలకిలారావాలతో పులికాట్ కొత్త అందాలు సంతరించుకుంది. బాల భానుడి లేలేత కిరణాలతో సంగమించి పుత్తడి పులికాట్‌లా సాక్షాత్కరిస్తోంది. కదిలే పడవలు.. వలలు విసిరే జాలర్లు.. బిలబిలమంటూ వాలే వలస పక్షులు.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే దారికి ఇరువైపులా పక్షులు సందడి చేస్తుంటాయి. తడ సమీపంలోని భీములవారిపాళెం నుంచి ఇరకం దీవి వైపునకు పడవలో వెళ్తే ఆ అనుభూతి మరోలా ఉంటుంది. ఫ్లెమింగో పండుగకు జిల్లా సిద్ధమవుతున్న వేళ పులికాట్ సందర్శన పర్యాటకులకు ఈ ఏడాది అద్భుత ఆనందాన్ని ఇస్తుంది. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ పులికాట్ అందాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ ఇలా పడ్డిస్తున్నారు...







పులికాట్‌లో దొరికే అరుదైన ముక్కోలాను చేపలు



పెలికాన్స్ (గూడబాతులు)



రెడ్ క్రెస్టెడ్ పోచ్డ్ (ఎర్ర తల చిలువ)



కామన్ కూట్ (నామాల కోడి)



పక్షులు.. పడవలూ

ఇదీ ఈ ఏడాది పక్షుల లెక్క..

చెన్నై నుంచి వచ్చిన నిపుణులు పక్షుల పోబిడిని గమనిస్తూ లెక్కలు కడుతున్నారు. శక్తిమంతమైన బైనాకులర్లు, వీడియో కెమెరాలతో వీరు పక్షులను లెక్కకడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా పులికాట్‌ను ఆశ్రయించిన వలస పక్షుల వివరాలు ఇవీ...

పక్షి పేరు	వాటి సంఖ్య
గ్రేటర్ ఫ్లేమింగో(రాజహంస) :	27,153
గ్రే పెలికాన్ (గూడబాతు) :	425
పెయింటెడ్‌స్టార్క్(ఎర్రకాళ్ళ కొంగ) :	2616
లిటిల్ ఈగ్రేట్స్(చిన్న తెల్లకొంగ) :	7962
లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు):	9862
లార్జీకార్మోరెంట్స్(పెద్ద నీటికాకులు) :	211
లార్జీఈగ్రేట్స్(తెల్ల కొంగ) :	1929
గ్రేహెరాన్(నారాయణపక్షి) :	280
పాండ్ హెరాన్(గుడ్డి కొంగ) :	595
నైట్‌హెరాన్(చింత వాఖి) :	347
ప్రాపెల్ హెరాన్(ఎర్రనారాయణపక్షి):	16
కర్లెవ్(ఉల్లంకి పిట్ట) :	44
గ్లోస్‌సి ఐబీస్(తాటి కంకణం) :	4323
కాటిల్ ఈగ్రేట్(పశువుల కొంగ) :	6589
ఇండియన్ మూర్హెన్(తెల్లబొర్ర నీటి కోడి) :	988
యురేషియన్ కూట్(నామాల కోడి) :	4487
కామన్ కింగ్ ఫిషర్(చిన్న నీల బుచ్చిగాడు) :	176
పర్పల్ స్విమ్‌ఫెన్(సుల్తాన్ పక్షి) :	637
డాబ్ చిక్(బుడ్డకోడి) :	1086
సీగల్స్(సముద్రపు గౌరుకాకి) :	893
రెడ్ వాటిల్ లాప్వింగ్(ఎర్ర తీతువు పిట్ట) :	86
వైట్ బ్రెఆస్టెర్డ్ కింగ్ ఫిషర్(తెల్లచుక్కల నీల బుచ్చిగాడు) :	41
స్పాట్ బిల్ డక్(చుక్కముాతిబాతు) :	211
బ్లాక్ వింగ్డ్ స్టిల్(నల్ల రెక్కల ఉల్లంకి) :	2482
పైడ్ కింగ్ ఫిషర్(నీళ్ళ బుచ్చిగాడు) :	28
26. గ్రాబీ ప్లోవర్(వాడర్ పక్షి) :	196
కామన్ టర్న్(రివ్వు పిట్ట) :	211
కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి) :	373
రివర్ టర్న్(రామదాసు) :	440
వింబ్రెల్ (పెద్ద ఉల్లంకి) :	13
ఓపన్ బిల్ స్టార్క్స్(నత్తగుల్ల కొంగలు) :	8165
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి) :	5556
మార్ష్ హారియర్(చిత్త నేల గద్ద) :	03
ఫాసియానాస్ టెల్డ్ జాకనా(నెమలి తోక కొంగ) :	720
లెసర్ విజిలింగ్ డక్(సన్న ఈల చిలువ) :	200
రింగ్ ప్లోవర్ (పెద్ద బైతు ఉల్లంకి) :	353
బ్లాక్ టైల్డ్ గాడ్విట్(తొండు ఉల్లంకి) :	353
ప్లామ్ స్విఫ్ట్(చటక పక్షి) :	114
ఫ్లై క్యాచర్స్ (పిగిలి పిట్ట) :	96
బ్లాక్ డ్రోంగో (పసల పోలిగాడ్డు) :	62
గ్రీన్ బీ ఈటర్స్(చిన్న పస్సిరికి) :	289
పిన్టైల్ (సూదితోక బాతు) :	2450
కెంటిష్ ప్లోవర్(చిన్న బైతు ఉల్లంకి):	98
కామన్ రెడ్షాంక్(ఎర్రకాళ్ళ ఉల్లంకి) :	129
కామన్ గ్రీన్షాంక్(పచ్చకాళ్ళ ఉల్లంకి):	268
గ్రీన్ శాండ్ పైపర్(నల్ల ఉల్లంకి) :	342
సూపన్‌బిల్(తెడ్డు మూతి కొంగ) :	122
డార్టర్(పాము మెడ బాతు) :	08
మొత్తం :	117216



మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

నాయుడుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి గురువారం మీడియా సమావేశం నిర్వహించిన క్రీడా, రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని పలువురు టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు మధురెడ్డి, నెలవల రాజేష్, చంద్రారెడ్డి, సంచి కృష్ణయ్య, రమేష్ నాయుడు, అవధానం సుధీర్, నానా బాల సుబ్బారావు, జీవీఆర్ నాయుడు, మస్తాన్ తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పెళ్లకూరు: రేణిగుంట విమానాశ్రయం నుంచి నాయుడుపేటలోని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నివాసానికి వెళ్తున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని తాళ్వాయిపాడు వద్ద పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దామెర ప్రసాద నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ నాయుడు, నాయకులు పేరం రమేష్ నాయుడు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, మాడుపూరు మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరులో కలపాలంటూ సీఎంకు లేఖ

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలంటూ సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు గురువారం హైదరాబాదు నుంచి స్థానిక విలేకర్లకు తెలిపారు. నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న గూడూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని గత ప్రభుత్వం తిరుపతి జిల్లాలో విలీనం చేసిందన్నారు. దీనివలన గూడూరుతోపాటు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి తిరుపతి చేరుకోవాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌లు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని ప్రజలకు హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని నెరవేర్చాలని లేఖలో కోరినట్లు కోటేశ్వరరావు పేర్కొన్నారు.


పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



జయంపు పాఠశాల పూర్వ విద్యార్థులు

బాలాయపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయంపు ఉన్నత పాఠశాలలో 1983 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సంతోషంగా గడిపారు. జయంపు కృష్ణ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.35వేలు విలువైన మైక్‌సెట్‌ను హెచ్‌ఎం రమణయ్యకు అందజేశారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వీర్లయ్యస్వామి ఉత్సవాలు



వీర్లయ్యస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీమంత్రి పరసా రత్నం

పెళ్లకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని శిరసనంబేడు, రోసనూరు, తాళ్వాయిపాడు గ్రామాల్లోని సిద్ధేశ్వర స్వామి, భూపతేశ్వరస్వామి, వీర్లయ్యస్వామి ఉత్సవాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం తాళ్వాయిపాడు గ్రామంలో నిర్వహించిన వీర్లయ్యస్వామి ఉత్సవాల్లో మాజీమంత్రి డాక్టర్ పరసారత్నం, సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ గొల్ల నరసింహయాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ భర్త పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా ముగ్గుల పోటీలు

ఓజిలి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కీర్తిపాటి అర్జున్‌రాజు, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రవీంద్రరాజుల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎస్‌ఐ స్వప్నలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎం.భాగ్యలక్ష్మి, ద్వితీయ బహుమతి వై.సుజాత, తృతీయ బహుమతి పి.కిష్కింద దక్కించుకున్నారు. సర్పంచు శారద, ఏపీవో ఉషారాణి పాల్గొన్నారు.

ప్రచారమేదీ?

తడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌కు తగిన ప్రచారం జరగలేదు. పండుగ జరిగేప్రాంతాలలో ఇప్పటికీ గోడపత్రికలను సైతం ఏర్పాటు చేయకపోవడం విశేషం. సూళ్లూరుపేట కళాశాల మైదానంలో మాత్రమే ఇంచుమించుగా ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. భీములవారిపాళెం పడవలరేవులో ఇంకా ఏర్పాట్లు పూర్తికాలేదు. మరో వైపు అక్కడ రోడ్డు నిర్మాణం పర్యాటకులకు ఇబ్బందిగా మారే ఆస్కారం నెలకొంది. గతంలో సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూల్ ముందుగానే ప్రచారంలోకి తీసుకువచ్చేవారు. ప్రస్తుతం అటువంటివి ఏవీ అధికారులు విడుదల చేయలేదు.

మద్యం విక్రేతపై కేసు నమోదు

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో భగవతి అనే మహిళ మద్యం బెల్టు దుకాణం నిర్వహిస్తుండగా గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆమె వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట హోలీక్రాస్ వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రవీంద్రరెడ్డి, నెల్లూరు జిల్లా కలువాయికి చెందిన మస్తాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. ప్రొద్దూరుకు చెందిన రవీంద్రరెడ్డి తమిళనాడు తాంబరంలో ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం మోటరు సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో గుమ్మడిపూడి వద్ద మస్తాన్ లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఇద్దరూ మోటరు సైకిల్‌పై వస్తుండగా సూళ్లూరుపేట హోలీక్రాస్ సర్కిల్ వద్దకు చేరుకోగానే వెనుకనే వస్తున్న అపాచి పరిశ్రమ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. బస్సు ముందుభాగంలో మోటరు సైకిల్ ఇరుక్కుపోయి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

ఓజిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలు గ్రామానికి చెందిన కూతల నాగేశ్వరరావుపై గురువారం అదే గ్రామానికి చెందిన సాలాపక్షి వెంటేశ్వర్లుతోపాటు అతడి తండ్రి, భార్య దాడి చేశారు. సంఘటనలో నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఇటీవల ఎన్నికల వరకు ఒకే వర్గంగా ఉన్నారు. ఎన్నికల నేపథ్యంలో నాగేశ్వరరావు టీడీపీ, వెంకటేశ్వర్లు వైసీపీల సానుభూతి పరులుగా వేరుపడ్డారు. దీంతో వీరి మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. నాగేశ్వరరావు పనిమీద వెళ్లి వస్తుండగా వెంకటేశ్వర్లు సూరికత్తితో దాడిచేయగా.. అతడి తండ్రి, భార్య కూడా పాల్గొన్నారు. నాగేశ్వరరావు తీవ్రంగా గాయపడటంతో చికిత్సకోసం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఓజిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీనేత

బాలాయపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు గ్రామానికి చెందిన టీడీపీనేత, మండల రైతువిభాగం అధ్యక్షుడు ఆది వెంకటకృష్ణారెడ్డి గురువారం శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. లక్ష రూపాయలు నగదు చెల్లించి ఆయన టీడీపీ జీవితకాల సభ్యత్వాన్ని పొందారు. టీడీపీపై అభిమానంతో జీవితకాల సభ్యత్వాన్ని పొందినట్లు ఆయన తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏపరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు ఆటవిడుపుగా ఉండేలా క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. గురువారం మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, పోలీస్‌శాఖలు, న్యాయవాదులు, వాకర్లు, వైద్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

ఏరూరులోనూ...

చిల్లకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరులో చేవూరు చెంచురామయ్య జ్ఞాపకార్థం రామాసీతా వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో గురువారం ఏరూరు అల్లీపురం - ఏరూరు బలిజపాళెం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన అల్లీపురం జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బలిజపాళెం జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసి ఓటమిపాలైంది.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



మానసను అభినందిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో స్థానం సంపాదించిన క్రీడాకారిణి మానసను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో పలాసలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో ఉమ్మడి నెల్లూరుజిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మానస ప్రతిభచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో మానస రాష్ట్ర జట్టు తరుపున పాల్గొననుండటం సంతోషకరమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఏదో ఒక క్రీడలో మక్కువ చూపాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, కోటేశ్వరరావు, భాస్కర్, కరిముల్లాఖాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎమ్మెల్యే కురుగొండ్ల సోదరుడి మృతి

- కమ్మవారిపల్లిలో విషాదం



కురుగొండ్ల శేఖర్ (ఫైల్ ఫొటో)

డక్కిలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోదరుడు కురుగొండ్ల శేఖర్ (53) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గుంటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా స్థిరపడ్డ శేఖర్ ఇంటి వద్ద రాత్రి భోజనం చేశాక ఛాతీలో నొప్పితో ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస వదిలారు. సోదరుడు మృతి చెందాడన్న సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజయవాడ నుంచి హుటాహుటిన గుంటూరుకు తరలివెళ్లారు. శేఖర్ స్వగ్రామమైన డక్కిలి మండలం కమ్మవారిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎన్నికల సమయంలో తన అన్న గెలుపుకోసం కష్టపడి పనిచేయడంతోపాటు ఇక్కడి జనంతో సన్నిహితంగా మెలగడంతో నియోజకవర్గ ప్రజలకు శేఖర్ సుపరిచితుడయ్యారు. ఆయన మరణ వార్త పలువురిని కలచివేసింది. శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు కమ్మవారిపల్లిలో అంత్యక్రియలు

కురుగొండ్ల శేఖర్ మృతదేహం శుక్రవారం ఉదయానికి కమ్మవారిపల్లికి చేరుకుంటుదని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని చెప్పారు.


హక్కుల కోసం ఉద్యమిద్దాం

కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యమని.. ఇందుకోసం ఎంతటి త్యాగాలకైనా వెనుకడుగువేసే ప్రసక్తే లేదని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని విద్యానగర్‌లో గురువారం ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని బోధనేతర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఇంజనీరింగ్ కళాశాల నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు జీతభత్యాలు, డీఏ, వార్షిక ఇంక్రిమెంట్‌లు, అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. లేకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. హక్కులు, డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఏఐటీయుసీ, సీపీఐ నాయకులు రాధాకృష్ణ, కాలేషా, ప్రభాకర్, శశికుమార్, చంద్రబాబు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పక్షుల పండుగ

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం నుంచి జరిగే పక్షుల పండుగ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస ప్రసాద్, ఆర్డీవో కిరణ్మయి అన్నారు. గురువారం ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పక్షుల పండుగకు జూనియర్ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, మొత్తం 35 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో ప్రభుత్వ, ప్రైవేట్ స్టాల్స్ ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అందరూ సమన్వయంతో పక్షుల పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ రవీంద్ర, తహశీల్దార్ నరసింహారావు, మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్య, ఎంఈవో శ్రీనివాసులు, డీఎఫ్‌వో హారిక తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లపై సబ్‌కలెక్టర్ పరిశీలన



నేలపట్టులో అధికారులతో కలసి పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా

దొరవారిసత్రం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శనివారం నుండి మూడు రోజుల పాటు జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను గురువారం నేలపట్టుపక్షుల కేంద్రంలో గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా పరిశీలించారు. పక్షుల కేంద్రంలో స్టాల్స్ ఏర్పాటుపై వేగంగా పనులు చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వాహనాల పార్కింగ్ కోసం టూరిజం రిసార్ట్ స్థలాని ఉపయోగించేలా పనులు చేయాలని చెప్పారు. సందర్శకులకు నీటి వసతి, ఇతర సదుపాయాలపై స్థానిక అధికారులతో చర్చించారు. నేలపట్టు ఈసీ కేంద్రం, చెక్ లిస్ట్ ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక తహసీల్దారు శైలాకుమారి, నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

గూడూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. తహసీల్దారు చంద్రశేఖర్, డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగించే సీపీఎం సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఈ తరహా పోటీలను నిర్వహించడం హర్షనీయమన్నారు. జోగి శివకుమార్, శంకరయ్య, వెంకట్రామిరెడ్డి, మణి, బీవీర మణయ్య, సురేష్, ప్రసాద్, సుధారాణి, వినీల పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం నిరంతర పోరాటం

- నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల కోసం నిరంతర పోరాటం చేస్తానని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం వెంకటగిరిలోని తన నివాసంలో నియోజకవర్గ స్థాయి వైసీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే అధికారపార్టీ నేతలు తనతో పాటు 11మందిపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. 2027లో జమిలీ ఎన్నికలు ఉంటాయని.. వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని.. మీరు చూపిన దారిలో మేమూ పయనిస్తామని హెచ్చరించారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న వైసీపీ మండల కన్వీనర్, పట్టణ కన్వీనర్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు వహీదా, బాలాయ్య, లక్ష్మీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, రాజా రెడ్డి, యస్దానీ బాషా, ముళవాయి వెంకటేశ్వర్లు, యాతలూరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పరిశీలన

వాకాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాకాడు శివాలయం వద్ద ఉన్న సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని గురువారం జడ్పీ సీఈవో విద్యారమా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చిట్టమూరు మండలంలో 19 గ్రామాలకు పైగా వాకాడు స్వర్ణముఖినది వద్ద ఉన్న సమగ్ర రక్షిత తాగునీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. నీళ్ల ట్యాంక్ నిచ్చెనకు రూ.5 లక్షల జడ్పీ నిధులు, చిట్టమూరు మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో కలిపి మరమ్మతు పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నందకుమార్‌కు సూచించారు. వాకాడు, చిట్టమూరు ఎంపీడీవోలు అన్నపూర్ణరావు, మనోహర్ గౌడ్, చిట్టమూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



కోట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో గురువారం గ్రామదేవత మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా కనుమ పండుగను పురస్కరించుకొని ఇక్కడ గాదే వారి కుటుంబం ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం పరిపాటి. మరో గ్రామదేవత అయిన కోటమ్మకు చెల్లెలుగా చెప్పుకునే మహాలక్ష్మమ్మను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో కోట పట్టణంలోని పలు వీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.